# తమిళనాడు: కావేరీ జలాల సమస్యపై సిపిఐ(ఎం-ఎల్) ప్రచార కార్యక్రమం

**కర్ణాటక,** తమిళనాడు రాష్ట్రాల నడుమ కావేరీ జలాల పంపక వివాదంపై ఎట్టకేలకు సుప్రీంకోర్టు తన తీర్పును వెలువరించింది. ఈ తీర్పు అమలుకై ఒక యాజమాన్య బోర్డును ఏర్పాటుచేయాలని కేంద్రప్రభుత్వానికి సూచించింది. దశాబ్దాలుగా పాలకవర్గాలు తమ స్వార్ధ రాజకీయ ప్రయోజనాలు నెరవేర్చుకోవటానికి కర్ణాటక, తమిళనాడు ప్రజలమధ్య విభేధాలు కల్పించి, ఆ వివాదాల్ని సాగలాగుతూ ప్రాంతీయ భావోద్వేగాలు రెచ్చగొడుతూ ఇరురాష్ట్రాల మధ్య శత్రుపూరిత వాతావరణాన్ని వ్యాప్తిచేస్తూ వస్తున్నారు.

బిజెపి ప్రభుత్వం కూడా ఇవే విధానాలను అమలుచేస్తోంది. కావేరీ నదీజలాల యాజమాన్య బోర్డును వెనువెంటనే ఏర్పాటు చేయటానికి బదులుగా, సమస్య పరిష్కారానికి చర్చలు సాగించాలనే నాటకమాడుతోంది. ఈ పరిస్థితిని గమనించిన తర్వాత సిపిఐ(ఎం-ఎల్) తమిళనాడు రాష్ట్రకమిటి ప్రచార కార్యక్రమం చేపట్టింది. తంజావూరు జిల్లాలోని కపిస్థలం, తిరుప్పానంతాల్, అల్దూర్ ప్రాంతాలలోనూ, అరియలూర్ జిల్లాలోని అండిమాదమ్, టి.పలార్ ప్రాంతాలలోనూ ఈ ప్రచార కార్యక్రమం సాగించింది. నదీ జలాల యాజమాన్య బోర్డును తక్షణం ఏర్పాటుచేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్‌చేస్తూ పార్టీ ఆధ్వర్యంలో వేలాది కరపత్రాలను ప్రచురించి, పంపిణీ చేయటంతోపాటుగా అనేక గ్రామాల్లో, పట్టణాల్లో బహిరంగసభలను కూడా నిర్వహించారు.

రైతాంగ ప్రతినిధులతో వెనువెంటనే నదీజలాల యాజమాన్య బోర్డును ఏర్పాటుచేయాలని, సాగునీటి వ్యాపారీకరణను అరికట్టాలని, దేశంలోని అన్ని నదుల నీటి వివాదాల సమస్యలను పరిష్కరించేందుకు శాశ్వత నదుల సమన్వయ పథకాన్ని రూపొందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని పార్టీ డిమాండ్ చేసింది.

వ్యవసాయానికి వీలుగా రాష్ట్రంలో 40వేల చెరువులను పునరుద్ధరించాలని, సాగునీరు లభించక నష్టపోయిన రైతులకు పరిహారం కల్పించాలని, నష్టపోయిన రైతులకు, వ్యవసాయకూలీలకు ప్రజాపంపిణీ వ్యవస్థను మరింత విస్తృతంచేసి, ఆహార ధాన్యాలను మరింత అధికంగా అందించాలని తమిళనాడు రాష్ట్రప్రభుత్వాన్ని పార్టీ డిమాండ్ చేసింది.

పాలకవర్గాలు వ్యాప్తిచేస్తున్న విభజించే ఎత్తుగడలకు, ప్రాంతీయ ఉన్మాదాలకు సమిధలు కారాదని సిపిఐ(ఎం-ఎల్) తమిళనాడు, కర్ణాటక ప్రజానీకానికి పిలుపునిచ్చింది. రైతులకు సకాలంలో సాగునీటిని న్యాయబద్ధంగా అందించాలని డిమాండ్ చేస్తూ, నదీజలాలను, నీటిని, భూమిని ఇతర వనరులన్నింటినీ కొల్లగొట్టుకెళ్ళే భారత బడాబూర్జువా వర్గానికి, సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా ఇరు రాష్ట్రాల ప్రజలు ఐక్యంగా ఉద్యమించాలని సిపిఐ(ఎం-ఎల్) తమిళనాడు రాష్ట్రకమిటి పిలుపునిచ్చింది.

ooooo